

కథ 1993

4

# ఇదీ ప్రశ్న

వడ్లమూడి దుర్గాంబ

వందనకు ఓ ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా ఉద్యోగమొచ్చింది. ఆమెకు చాలా ఆనందమనిపించింది.

ఏ ఆధారం లేకుండా తనకు తానుగా నిలబడ గలిగినప్పుడు ఓ పసిపాప నవ్వులో కనిపించే ఆనందం, ఎవరి సహాయం లేకుండా తన చిట్టిచెల్లిని ఎత్తుకోగలిగినప్పుడు ఓ చిన్నబాబులో పొంగే సంతోషం-వందనకు ఇల్లంతా ఎగిరి గంతులేయాలనిపించింది. అంత పనీ చేసింది కూడా!

“ఇకచాల్లే ఆపు! ఏదో అయ్యేయస్ ఆఫీసర్ అయినట్టు తెగసంబరపడిపోతున్నావ్,” వందన ఆనందం చూసి వెటకారంగా అన్నాడు, ఆమె అన్న వినోద్. అతను డిగ్రీ పూర్తయి ఐదేళ్లయినా ఏ పనీలేక రోడ్లు కొలుస్తున్నాడు. వందనకు తెలుసు అతని ఉక్రోషం. అందుకే ముందు కోపం వచ్చినా, ఆ వెంటనే అన్నపై జాలి అనిపించి మౌనంగా ఉండిపోయింది.

ఆమెకి తెలుస్తూనే ఉంది, తనకి ఉద్యోగమొచ్చినందుకు తను తప్ప ఇంట్లో ఇంకెవరూ ఆనందించడం లేదు. “అదేదో వాడికి వచ్చినా బాగుండేది. ఇప్పుడు నీ వెనకాల ఆ ఊరికి ఎవరు రావాలి? ఇంటర్వ్యూకి తీసికెళ్లేప్పటికే నా తలప్రాణం తోకకొచ్చింది.” ఉద్యోగం వచ్చింది అనగానే ఆమె తండ్రి ప్రతిస్పందన అది. తల్లి కూడా అదే భావం వ్యక్తపరచింది.

ఆడపిల్ల ఒంటరిగా ఎలా ఉండగలదు అనే ఆటంకమే తన ఆశలన్నీ నిరాశలు చేసేట్టుంది. తను ఎన్నేళ్లుగా కలలు కంటోంది- తనకు తానుగా సంపాదించుకోవాలని, ఎవరిమీదా ఆధారపడకుండా బతకగలగాలి అని. ఎన్నాళ్ల ఆలోచనలు ఇవి! ఎన్నేళ్ల ఆశలు ఇవి!

వందన పదవ తరగతి చదువుతున్నప్పటి సంగతి. వాళ్లింటిపక్క ఓ కుటుంబం ఉండేది. అతను పచ్చి తాగుబోతు. భార్యాపిల్లల్ని అసలు పట్టించుకునేవాడు కాదు. పైగా, తాగివచ్చి నానా హింసలు పెట్టేవాడు. ఆమె నోరెత్తేది కాదు. పరువు మర్యాదలే ప్రాణంగా భావించే మధ్యతరగతి ఇంట్లోంచి వచ్చిన మనిషామె. భర్త నుంచి విడిపోయి పిల్లల్ని పోషించుకోవాలంటే ఏ ఉద్యోగమో చూసుకోడానికి తగిన చదువు లేదు. అలాగని ఏ కాయకష్టమో చేసుకోవాలంటే అడ్డువచ్చే ఆత్మాభిమానం, పరువు మర్యాదలు, ఆమె అనుభవంచిన నరకయాతన, సరైన బట్టలు, పుస్తకాలు లేని పిల్లలు తోటి పిల్లల ముందు పడిన అవమానాలు- అన్నీ స్పష్టంగా, కళ్లారా చూసింది వందన.

అప్పుడే వందనలో మొలకెత్తాయి ఈ ఆలోచనలు.

దీనికంతటికీ ఆమెకు చదువులేకపోవడం, సొంతంగా సంపాదించుకొనే అవకాశం, మనోధైర్యం లేకపోవడమే కారణాలు కాబట్టి ప్రతి ఆడపిల్ల చదువుకోవాలి. తరువాత జీవితం ఎలాంటిదైనాకానీ, ముందు తనకు తానుగా సంపాదించుకోగలగాలి.

ఆమెతో పాటుగా పెరిగి పెద్దవై మరింత దృఢంగా మనసులో బలపడిపోయిన ఆలోచనలు అవి. అందుకే ఇంట్లో అందరూ వ్యతిరేకిస్తున్నా, నిరుత్సాహపరుస్తున్నా, ఆమెలో పట్టుదల ఏ మాత్రం సన్నగిల్లడం లేదు.

“పోనీ అన్నయ్యా, నేనూ ఉంటాం అమ్మా! అన్నయ్య కూడా ఆ ఊళ్లనే ఏదో ఒకటి చూసుకో

వచ్చు,"తల్లితో అంది. ఆమె సమాధానం చెప్పే లోపలే అక్కడే ఉన్న వినోద్ గయ్‌మంటూ లేచాడు. "ఏంటి చూసుకునేది నా మొహం. నువ్వు టింగురంగా అంటూ బయటికి పోతుంటే, నేను చప్రాసీ వెధవలా నీకు వండి పెడుతుండాలా?" మగవాడిననే అహంకారం అతనిచేత ఆ మాటలు అనిపించింది. కొడుకుతో ఏకీభవిస్తున్నట్టుగా తల్లి మౌనంగా ఉండిపోయింది. ఒకవేళ వినోద్‌కే ఉద్యోగమొచ్చి, వందనే ఈ మాటలు అని ఉంటే ఆమె అలా ఊరుకునేదా? కన్నతల్లికే వాళ్లిద్దరినీ సమానంగా చూడాలన్న ఆలోచన అణువంతయినా లేదు. ఇక బయటి ప్రపంచానికి ఉంటుందా!

వందన హృదయంలో నిరాశ తొంగి చూసింది. తను ఆడపిల్లకి ఆర్థిక స్వాతంత్ర్యం గురించి ఆలోచిస్తోంది. అసలు ఇంట్లోంచి ఒంటరిగా బయటకు అడుగుపెట్టే స్వాతంత్ర్యం రావాలి కదా ముందు. ఇంకో నాలుగు రోజులుంది టైం వెళ్లి జాయిన్ అవడానికి. అందరూ నిమ్మకు నీరెత్తినట్టున్నారు. వందన మనసులో ఆందోళన మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉంది.

ఆరోజు అనుకోకుండా వందన అమ్మమ్మ వచ్చింది. వాళ్లుండేది పక్క పల్లెటూరిలోనే. ఆమెని చూడగానే వందనలో ఆశ మళ్లీ చిగురులు వేసింది. అప్పటికే ఇంట్లో జరుగుతున్న తర్జన భర్జనలు గురించి తల్లి చెప్పేసింది. "అమ్మమ్మా! నువ్వూ, తాతయ్య వచ్చి నాతో ఉండొచ్చుకదా," సంశయిస్తూనే అడిగేసింది. మనవరాలి మాట పూర్తికాకముందే ఆవిడ ఏదో వినరాని మాట విన్నట్టుగా మొహం పెట్టి "ఇంకానయం- నీ బోడి ఉద్యోగం కోసం అక్కడ ఇల్లూ వాకిలీ, పొలం పుట్ర వదిలి రమ్మంటావా. మాబాగా చెప్పావుగానీ, ఇప్పుడు నువ్వు ఉద్యోగం చేయకపోతే కొంపలేం మునిగిపోవు. మానేసెయ్" అంది ఒక్కటే మాటగా.

వందన ఇంక మాట్లాడలేదు రెండు రోజులు మౌనవ్రతం, నిరాహారదీక్ష సాగించింది. అప్పుడు మళ్లీ ఇంట్లో ఆలోచించడం మొదలుపెట్టారు ఇంకా ఏమన్నా మార్గముందా అని. 'ఆ ఊర్లో మన చుట్టాలొకరు ఉన్నారమ్మాయ్. వాళ్లింట్లో ఉంచుదామా పోనీ," వందన అమ్మమ్మ అంది.

వందనకు మళ్లీ ప్రాణం లేచొచ్చింది. "ఎవరే అమ్మమ్మా!" అంది.

"నాకు తెలియని చుట్టాలెవరే?" ఆశ్చర్యంగా అంది వందన తల్లి.

"ఏదో దూరపు బంధుత్వం మీ నాన్నకావిడ కోడలవుతుంది. పరిచయాలేంలేవు. వెళ్లి మనమే పరిచయం చేసుకోవాలి." చెప్పిందావిడ. భర్త తరపు వాళ్లని ఆమడ దూరంలో ఉంచుతుందామె. అదీ విషయం!

అయినాసరే, వందన వదిలిపెట్టలేదు. ముందు ఇక్కడి నుంచి బయలుదేరి అక్కడ జాయిన్ అయితే, తనలాంటి మరో అమ్మాయిని చూసుకుంటే ఏదన్నా రూం తీసుకొని ఉండొచ్చు. అందుకే మంకుపట్టు మరి కాస్త పెంచింది. వందన అమ్మమ్మకు ఇక తప్పలేదు. మనవరాల్ని తీసుకొని బయలుదేరింది. బయలుదేరింది గానీ, వందనకు భయంగానే ఉంది. ఆ ఇంట్లో వాళ్లెలాంటివాళ్లో, తను వాళ్ల మధ్య ఉండగలదా? అసలు వాళ్లు ఒప్పుకుంటారా?

పరిచయ కార్యక్రమాలయ్యాక ఆ ఇంటి ఆవిడ పరమేశ్వరిని వందన అమ్మమ్మ మాటల్లోకి దింపింది. "మీ నాన్న మా ఇంటికి బాగా వస్తుండేవాడమ్మాయ్. తనకి కొడుకుల్లేకపోయినా నువ్వు ఆ లోటు లేకుండా చూసుకున్నావని చెబుతుండేవాడు."

వందన ఆశ్చర్యపోయింది అమ్మమ్మ మాటలకు. అలాంటి వ్యక్తులెవరూ తమకు తెలియదు.ఆ మహానుభావుడెవరో పోయినట్టున్నాడు పాపం!

అవతల ఆవిడ పరమేశ్వరి కూడా తక్కువదేమీ కాదు. ఏన్నో ఏళ్ల పరిచయమున్నదానిలా మాట్లాడేస్తోంది. అమ్మమ్మ అంటున్న ఒక్కొక్క మాట- మాట అనేకంటే పొగడ్త అంటే బాగుంటుంది- పరమేశ్వరి శరీరాన్ని ఒక్కొక్క అంగుళం పెంచేస్తోంది.

మరో అరగంటకి అక్కడి నుంచి అమెరికా అంత దూరంలో ఉన్న అనుబంధం, బంధుత్వం అడుగు దూరంలో కొచ్చేశాయి.

తెలుగువాళ్లలో ఉన్న గొప్పతనమదే. చిన్న ఈర్ష్యతో ఇంటిపక్కనున్న సాటి తెలుగువాడ్ని బద్ధ శత్రువుగా చూడగలడు. అక్కడెక్కడో అండమాన్‌దీవుల్లో ఆంధ్రుడు బాధపడుతున్నాడంటే గుండెలు పిండేసేంత ఆర్ద్రత కురిపించగలడు. పరమేశ్వరి అలాంటిదే! ఆవిడకు తన తోడికోడళ్లతోగాని, ఆడబిడ్డలతోగాని ఎవరితోనూ పడదు. అలాంటిది ఎంతో దూరపు చుట్టమైన వందన విషయంలో మాత్రం చాల పెద్దమనసుతో, "మా ఇంట్లో ఉంటుందిలే అత్తయ్యా. ముందు జాయిన్ అవనీ. తరువాత విషయాలు ఆలోచిద్దాం," అనేసింది.

వందన ఆ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా సెటిలయింది. ఆమెకు బెరుగ్గానే ఉంది. ఆ ఇంట్లో ఉండేది పరమేశ్వరి, ఆవిడ భర్తా, కొడుకూ, కూతురూ. చిన్న కుటుంబమే. పైగా ఇంట్లో పరమేశ్వరికి తప్ప మిగతా వాళ్లెవరికీ నోట్లో నాలుక ఉన్నట్టు లేదు. తన పనులు

తను చేసుకుని, టైముంటే ఏవన్నా ఇంటిపనులు చేసేది వందన. పరమేశ్వరి భర్త తప్ప ఇంట్లోంచి పొద్దున్నే బయటకు వెళ్లవలసిన వాళ్లెవరూ లేరు.

వాళ్లబ్బాయి సుధాకర్ నిరుద్యోగి. అతని లోకం అతనిది. ఎప్పుడూ కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేరవుతుంటాడు. ఇక అమ్మాయి ఇంటరుతో చదువు ఆపేసింది. ఇంట్లోనే ఖాళీగా ఉంటుంది.

వందనకు మొదట్లో పెద్దగా సమస్య అనిపించలేదు ఆ ఇంట్లో ఉండడం. కానీ, రానురాను పరమేశ్వరి మనస్తత్వం కొంచెం విపరీతంగా అనిపించడం మొదలుపెట్టింది. ఆవిడని అర్థం చేసుకోవడం వందన వల్ల కావడం లేదు. బయట ఎవరితోనన్నా మాట్లాడేప్పుడు ఆడపిల్లలు చదువుకోవాలి, ఉద్యోగాలు చేయాలి అంటూ ఆదర్శ మహిళలా మాట్లాడేది. మళ్లీ అదే నోటితో, ఎవరన్నా మీ అమ్మాయిని చదువు మానిపించేశారేమిటండీ అన్నప్పుడు, 'ఆ! మాలాంటి వాళ్లకెందుకండీ చదువులు. చదువుకుని ఉద్యోగాలు చేయకపోతే గడవని వాళ్లకయితే తప్పదు. మా అమ్మాయికేం కర్మ చెప్పండి,' అనేది. వందన ముందే అనేది అలా. 'ఆమె అభిప్రాయాలు ఆమెవి,' అని సరిపెట్టుకునేది. కానీ పరమేశ్వరి అక్కడితో ఆగకుండా మరికాస్త ముందు కెళ్లింది. వందన కొంచెం బద్ధకంగా ఉండి ఆలస్యంగా లేచినా, కొంచెం పొద్దుపోయి ఇంటికి వచ్చినా మెత్తమెత్తగానే మాటలనేది. 'ఎంత ఉద్యోగాలు చేస్తున్నా ఆడపిల్ల ఆడపిల్లగానే ఉండాలి,' అనేది. ఆవిడ అనే ప్రతి మాటలో తను ఉద్యోగం చేస్తున్నందుకు దెప్పిపొడుపు కనబడేది వందనకి.

మొదట్లో అర్థంకాకపోయినా రానురాను అర్థమవుతోంది వందనకు ఆమె మనస్తత్వం. తనకంటే ఎక్కువ చదివీ, మగవాడై ఉండీ, ఆమె కొడుకు ఊరికే గోళ్లు గిల్లుకుంటూ ఉండటం, తన తోడిదే అయిన ఆమె కూతురు చదువు సరిగ్గా అబ్బక ఇంట్లో ఉండటం- ఈ ఈర్ష్య ఆమెచేత అలా మాట్లాడిస్తోంది.మనిషికి ఈర్ష్యను వ్యక్తంచేసే మార్గం ఉండాలేగానీ, అదో వ్యసనంలా మారుతుంది. మళ్లీ ఆవిడకి తన పిల్లలంటే విపరీతమైన ప్రేమ, వాళ్లని ఒక్క మాట అనేది కాదు. ఇలా తమ పిల్లల మీద విపరీతమైన ప్రేమ ఉన్న వాళ్లు- వాళ్లపట్ల తమకున్న అసంతృప్తిని- పరాయి వాళ్లని మాటలనడం ద్వారా తీర్చుకోవడం మామూలే.

తనీ ఇంట్లో శాశ్వతంగా ఉండబోవడం లేదు. తననడానికి ఆవిడకేం అధికారం లేదు. ఈ విషయం ఆమెకూ తెలుసు. అయినా, ఆమె తన నోటిని అదుపులో ఉంచుకోలేదు. ఏమైనా, వీలయినంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూడాలి. తన కొలీగ్ సుమిత్ర, "మా ఇంటి పక్కనే చిన్న రూం ఖాళీగా ఉంది, నువ్వు అందులో ఉంటే మేము తోడుగా కూడా ఉంటాం," అంది నిన్ననే.

కానీ, అమ్మా నాన్న ఒప్పుకోరు ఒంటరిగా ఉండటానికి. అలా ఉంటున్నానని రాస్తే, వెంటనే వచ్చి ఉద్యోగం మానిపించి తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదు. మరి ఎవరన్నా తోడు దొరికేదాకా తనకీ పాట్లు తప్పవా?

ఆ రోజు సాయంత్రం సుమిత్రతో కలిసి బయటికి వచ్చింది ఆఫీస్ టైం అవగానే. అప్పుడు ఎవరో పిల్లవాడు పరిగెత్తుకుంటూ వచ్చి సుమిత్రతో, "మీ పాప స్కూల్ నుంచి వస్తుంటే స్కూటర్ కింద పడింది. కరుణా క్లినిక్‌లో చేర్పించారు," అన్నాడు గబగబా. సుమిత్ర ఒక్కసారిగా చేష్టలుడిగినదానిలా నిలబడిపోయింది. ఆపై వెంటనే తేరుకుని, వందనని పట్టుకుని బావురుమంది. సుమిత్రకి ఒక్కటే పాప. వాళ్లాయన కూడా పొద్దునే ఊరెళ్లారంట.

వందన ఆలస్యం చేయకుండా రిక్షాని పిలిచింది. సుమిత్రని ఎక్కించింది. తనూ ఎక్కబోతున్నప్పుడు సుధాకర్ కనబడ్డాడు ఆ పక్కనే. వెంటనే గుర్తొచ్చిందామెకి, తను ఐదు నిమిషాలు ఇంటికెళ్లడం లేట్ అయినా పరమేశ్వరి అనే మాటలు. గబగబా సుధాకర్ దగ్గరికెళ్లింది. "సుధాకర్, మా కొలీగ్ పాపకి యాక్సిడెంటయిందట. వాళ్లాయన కూడా ఊర్లో లేరు. అవసరమైతే ఈ రాత్రి నేను ఆమెతోనే ఉంటాను. మీ అమ్మగారికి ఈ విషయం చెప్పండి. మర్చిపోవద్దు," చెప్పేసి వెళ్లి రిక్షాలో కూర్చుంది.

అప్పుడు ఎందుకో అనుమానం వచ్చి వెనక్కి తిరిగి చూసింది. సుధాకర్ ఇంకా తనవైపే చూస్తూ నిలబడి ఉన్నాడు. అతని పక్కనే ఓ అమ్మాయి. అతని మొహంలో అదోరకమైన భయంలాంటి భావం. ఓ సినిమాహాల్‌కి దారి వాళ్లు వెళ్లేది. రిక్షా ముందుకు నడిచింది. 'అమ్మో! ఎంత అమాయకుడిలా కనబడతాడు. సుధాకర్ తక్కువేమీ కాదు!' మనసులో అనుకుంది వందన.

రాత్రంతా హాస్పిటల్‌లోనే ఉండిపోయింది సుమిత్రతోపాటు. పాపకి ప్రమాదం తప్పింది. ఆ పరిస్థితుల్లో సుమిత్ర పక్కనే ఉండి ధైర్యం చెప్పగలిగినందుకు వందనకెంతో ఆనందం అనిపించింది.

కానీ, ఆ ఆనందం అంతా తెల్లారి ఇంటికెళ్లగానే ఉఫ్‌మని ఊదేసినట్టు మాయమైంది. పరమేశ్వరి వందనని చూడగానే మొదలుపెట్టింది. ఒక మాట కాదు, నోటికొచ్చినట్టు అంటోంది. "నువ్వు రాత్రంతా ఇంటికి రాకుండా తిరుగుతుంటే మేం భయంతో పిచ్చి

పట్టినవాళ్లలా ఊరంతా తిరగాలా తల్లీ! ఎక్కడ ఉన్నావ్ రాత్రంతా?'' రాత్రంతా అనే మాటని నొక్కినొక్కి పలుకుతూ ఉరిమినట్టే అరుస్తోంది ఆవిడ.

వందన తెల్లబోయింది. ఆవిడ మాటల్లోని నింద అర్థమైన వందనకి లోపలి నుంచి ఉక్రోషం, బాధ, ఏడుపు తన్నుకొస్తున్నాయి. గొంతు పెగలడం లేదు. "ఇదేమిటి! సుధాకర్ చెప్పలేదా?'' ఆ మాటే అడిగింది అతికష్టం మీద. తను ఇంటికి రాకపోవడానికి కారణం కూడా చెప్పింది. సుధాకర్ అక్కడే ఉన్నాడు. అతడు మౌనంగా తలదించుకున్నాడు. కానీ, పరమేశ్వరి మాత్రం మరికాస్త రెచ్చిపోయింది.

"నువ్వు తప్పు చేసింది చాలక మా అబ్బాయిని కూడా ఎందుకు ఇరికిస్తావ్? అసలు ఆ టైమ్కి మా వాడు అక్కడెందుకు ఉంటాడు. ఏదో చదువుకోవాలని ఫ్రెండింటికి వెళ్తేనూ, ఇంకా నయం- మా వాడికి నిన్ను చేసుకుందామనుకున్నాను. అసలే వాడు నోట్లో నాలుక లేని వెధవ. నీలాంటిదాన్ని చేసుకుంటే వాడ్ని మరీ వాజమ్మని చేసి ఆడించేదానివి...'' ఆవిడ కంఠం మోగు తూనే ఉంది.

వందన పిడికిళ్లు బిగుసుకున్నాయి. ఆవేశాన్ని బల వంతంగా అణిచేసుకుంది. గతిలేనివాళ్లు ఉద్యోగం చేస్తారు అంది. మరి తననెలా కోడల్ని చేసుకుంటుంది? ఇప్పుడే ఇన్ని మాటలంటోంది. రేపు కోడలినైతే తననేలా చూస్తుంది. ఆ ఊహే ఒళ్లు జలదరింపుగా వుంది.

పరమేశ్వరి ఆ మాటన్నాక కూడా వందన, 'మీ అబ్బాయిని ఒక అమ్మాయితో చూశాను నేను,' అన లేదు. అన్నా, అరచి చెప్పినా ప్రయోజనం ఉండదు. ఆవిడ తన మాటల్ని నమ్మదు. పరమేశ్వరి వాగుతూండ గానే, వందన ఒక నిశ్చయానికొచ్చినదానిలా లోపలి కెళ్లింది. తన బట్టలు, సామాన్లు వగైరా సూట్కేస్, బాగ్ లలో సర్దుకుని, రెండూ తీసుకుని బయటకొచ్చింది. అంత హఠాత్తుగా ఆమె అలా ప్రత్యక్షమవడంతో పర మేశ్వరి అవాక్కయింది. ఆమెకు ఏమాత్రం ఊహించని సన్నివేశం ఎదురయినట్టు ఆ ముఖకవళికలే చెపు తున్నాయి. వందనకు ఎందుకో నవ్వొచ్చింది. చాలు! పరమేశ్వరిపై తను కక్ష తీర్చుకోవాలంటే ఈ శిక్ష చాలు. ఆమె తనని తిట్టడం ద్వారా ఏదో పైశాచికానందాన్ని పొందుతోంది. ఆ ఆనందాన్ని అర్థంతరంగా లాగేసు కుంది తను.

వెళ్లొస్తాను అనైనా చెప్పకుండా బయటికి నడి చింది. సుమిత్ర చెప్పిన రూం తీసుకోవాలి అని ఇందాకే నిర్ణయించుకుంది. ఆలోచిస్తూ నడుస్తోందామె. పర మేశ్వరి గురించి, సుధాకర్ గురించి కాదు, తన గురించి. ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించి ఏం సాధించింది తను. ఈ ఉద్యోగం తనకేం ఒరగబెట్టింది. ఎప్పటిలాగే తల్లి దండ్రులకి భయపడుతోంది. ఒక్క నెలరోజులు ఆశ్రయం ఇచ్చినందుకు తన సొమ్ము తను తింటూ కూడా వీళ్లకి భయపడింది. ఒంటరిగా ఉంటే ఏమం టుందోనని ఈ సమాజానికి భయపడుతోంది. రేపు పెళ్ల యితే అతనికి, అతని తల్లిదండ్రులకి భయపడుతుంది. మరి ఏమిటి తను సాధించింది?

"వందనగారూ!'' ఉలిక్కిపడి చూసింది. సుధాకర్! తన వెనుకే వచ్చినట్టున్నాడు. అతని మీద ఉన్న కోపాన్ని దిగమింగుకుంటూ చూసింది ఏమిటి అన్నట్టుగా. "నన్ను క్షమించండి. నిన్న మీరు చూసిన అమ్మాయి, నేను ప్రేమించుకున్నాం. అమ్మకు ఆ విషయం తెలిస్తే ఇంట్లో కూడా ఉండనీయదు. పైసా సంపాదన లేనివాడ్ని బయటకెళ్తే ఎలా బతకాలో తెలియకే, ఉద్యోగం వచ్చే వరకూ ఈ విషయం ఇంట్లో చెప్పకూడదనుకున్నాను. నిన్న మీరు నన్ను చూసినట్టుగా ఒప్పుకుంటే, ఆ అమ్మాయితో ఉన్న విషయం ఎక్కడ చెప్పేస్తారోనన్న భయంతో చెప్పలేదు. నన్ను క్షమించండి,'' మరోసారి అని వెనక్కి తిరిగాడు సుధాకర్.

వెళ్లిపోతున్న సుధాకర్ వైపునే చూస్తూన్న వందన మొహంలో చిరునవ్వు కదలాడింది. మగవాడై ఉండీ తనకంటూ సంపాదన లేకపోవడం వల్లనే కదా సుధాకర్ కనీసం తన ప్రేమ గురించి ఇంట్లో చెప్పలేకపోయాడు. ఆత్మవంచన చేసుకుని అబద్ధమాడాడు. మరి తను తల్లి దండ్రులని ఎదిరించినంత పనిచేసి ఉద్యోగంలో చేరింది. అందుకోసం ఇల్లు దాటింది. వాళ్ల అంగీకారం తీసుకోకుండానే ఒంటరిగా ఉండేందుకు బయలు దేరింది. అదే సంపాదన లేని ఏ చదువుకునే అమ్మాయో అయితే ఈ నిర్ణయం తీసుకోగలిగేదా?

*ఇండియా టుడే పక్షపత్రిక, ఏప్రిల్ 21-మే 5 1993*